

వాకథాన్‌ను ప్రారంభిస్తున్న హెటిరో గ్రూప్ చైర్మన్ పార్థసారథి రెడ్డి, ఫార్మాసూటికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టీవీ.నారాయణ

సుల్తాన్ ఉల్ ఉలూమ్ కాలేజీలో వాకథాన్

బంజారాహిల్స్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో జూలై 5 నుంచి 7 వరకు జరగనున్న ఇండియన్ ఫార్మాసూటికల్ కాంగ్రెస్ (ఐపీసీ)ని పురస్కరించుకొని ఇండియన్ ఫార్మాసూటికల్ అసోసియేషన్, హెటిరో, ఎస్ఓసీపీఎంఆర్, సుల్తాన్ ఉల్ ఉలూమ్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, క్లినికోసోల్ రిసెర్చ్ సంయుక్తాధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ఆవరణలో వాకథాన్ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన హెటిరోగ్రూప్ చైర్మన్ బి.పార్థసారధిరెడ్డి, ఇండియన్ ఫార్మాసూటికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టీవీ.నారాయణ జెండా ఊపి వాక్‌ను ప్రారంభించారు. కాలేజీ ఆవరణ నుంచి బంజారాహిల్స్ ప్రధాన రహదారి వరకు జరిగిన వాకథాన్‌లో వైద్యవిద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీవీ.నారాయణ మాట్లాడుతూ హైటెక్స్‌లో జరగనున్న 78వ ఐపీసీలో వెయ్యి మందికి ఉద్యోగావకాశాలు, ఉచిత లైఫ్ సపోర్ట్ ట్రైనింగ్‌తోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే డెలిగేట్లతో విద్యార్థులు మాట్లాడే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్య పరమైన జాగ్రత్తలతో విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూమ్ ప్రిన్సిపల్ డాక్టర్ అనుపమ కోనేరు, అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై దృష్టి సారించాలి

● మన్నె కవితారెడ్డి

బంజారాహిల్స్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలపై అధికారులు దృష్టిసారించాలని వెంకటేశ్వరనగర్‌కాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో శనివారం ట్రాన్స్‌కో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ సమస్యలపై చర్చించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ చిన్న వర్షం పడినా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందనే ఫిర్యాదులు పెరిగిపోయాయని తెలిపారు. ఈ విషయంపై అధికారులు కిందిస్థాయి సిబ్బందితో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. డివిజన్ పరిధిలో పలుచోట్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని ప్రతిపాదనలు చేశామని, వాటిని త్వరితగతిన ఏర్పాటుచేయాలని సూచించారు. సమావేశంలో ట్రాన్స్‌కో డీఈ అశోక్, ఏఈ సుష్మ పాల్గొన్నారు.

సమావేశానికి రండి..తలసానికి ఆహ్వానం

అమీర్‌పేట, జూన్ 22 (ఆంధ్రజ్యోతి) : బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం నేపథ్యంలో ఈనెల 25న నిర్వహించతలపెట్టిన సమీక్ష సమావేశానికి రావాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఇన్‌చార్జ్ ఈవో అంజనీదేవి శనివారం మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన తలసాని అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలని ఈవోను కోరారు. కల్యాణ సమయం దగ్గర పడుతుండడంతో పరిసరాలు శుభ్రంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కూతురు నర్సింహ ఉన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలి

బంజారాహిల్స్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. ఫిలింనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసి వీధిదీపాల విభాగం అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ఫిలింనగర్‌లోని అనేక బస్తీల్లో రాత్రి సమయాల్లో వీధి దీపాలు వెలగక చాలామంది ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అధికారులు, సిబ్బంది వెంటనే వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కొత్తహైమాస్ట్‌లైట్లకు ప్రతిపాదనలు చేశామన్నారు.

27 నుంచి క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపికలు

● నాలుగో తరగతికి అర్హత పరీక్షలు: కలెక్టర్ అనుదీప్

హైదరాబాద్ సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని క్రీడాపాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి నాలుగో తరగతిలో ప్రవేశానికి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం తెలిపారు. సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో ఈనెల 27 నుంచి 30 వరకు ఉదయం 8 గంటల నుంచి ఎంపిక పోటీలుంటాయని చెప్పారు. 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, 6-10 మీటర్ల షటిల్ రన్, స్టాండింగ్స్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ, కిలో మెడిసిన్ బాల్‌త్రో, 800 మీటర్ల పరుగు, బరువు, ఎత్తు, మెడికల్ టెస్టులుంటాయన్నారు. హైదరాబాద్ జిల్లాలో మండల స్థాయి ఎంపికలు ఈ నెల 24, 25 తేదీల్లో జరుగుతాయని, జిల్లా స్థాయి ఎంపికలు 27 నుంచి 30 వరకు నిర్వహిస్తామన్నారు. అలాగే రాష్ట్రస్థాయి ఎంపికలు జులై 8 నుంచి 12 వరకు హకీంపేటలో ఉంటాయని చెప్పారు. ప్రవేశ పోటీలకు హాజరయ్యే బాలబాలికలు 1.9.2015 నుంచి 31.08.2016 మధ్య పుట్టిన వారై ఉండాలని, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలని వివరించారు. మరిన్ని వివరాలకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీకి చెందిన 040-27900649 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉద్యాన పాలిటెక్నిక్‌లో డిప్లొమా కోర్సుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

రాజేంద్రనగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో రెండు సంవత్సరాల ఉద్యాన డిప్లొమా కోసం నోటిఫికేషన్ జారీచేసింది. ఉద్యాన పాలిటెక్నిక్‌లో 200 సీట్లు ఉండగా, ఆదిలాబాద్, రమగిరికిల్లా, కొల్లాపూర్ పాలిటెక్నిక్ ఉద్యాన కళాశాలలలో 40 చొప్పున ఇన్‌టెక్ కెపాసిటీ ఉందని వర్సిటీ అధికార వర్గాలు తెలిపాయి. మరో రెండు అఫిలేటెడ్ పాలిటెక్నిక్‌లు గడ్డిపల్లిలో గల గంటా గోపాల్‌రెడ్డి ఉద్యాన పాలిటెక్నిక్, మహబూబాబాద్‌లోని తొర్రూర్‌లో గల విశ్వధార హార్టికల్చర్ పాలిటెక్నిక్‌లో కూడా 40 చొప్పున సీట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 15 నుంచి దరఖాస్తులను తీసుకుంటున్నారని, జూలై 15వ తేదీ వరకు అందజేయవచ్చన్నారు. పాలిసెట్ 2024 లేదా 10వ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత, ఇంటర్ ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. 2024 డిసెంబర్ 31 నాటికి కనీసం 15 సంవత్సరాలు, గరిష్టంగా 22 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. 60శాతం సీట్లు గ్రామీణప్రాంతాల్లో కనీసం 4 ఏళ్ల చదివిన విద్యార్థులకు కేటాయిస్తారని తెలిపారు.

మొజర్ల ఉద్యాన కళాశాలలో డిప్లొమా

వనపర్తిజిల్లా మొజర్లలోని ఉద్యానకళాశాలలో, కొల్లాపూర్ ఉద్యాన పాలిటెక్నిక్‌లో ఉద్యాన డిప్లొమా చేయొచ్చని అధికారులు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట్ జిల్లాల విద్యార్థులకు ఇక్కడి ప్రాంగణం దగ్గరగా ఉంటుందని పాలిటెక్నిక్ వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పిడిగెం సైదయ్య తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేరుగా బీఎస్సీ హార్టికల్చర్ డిగ్రీలో హార్టీ సెట్ ద్వారా సీటు సంపాదించవచ్చు. ఇతర వివరాల కోసం హెల్ప్ డెస్క్ నెంబర్ 9652456779లో సంప్రదించాలని లేదా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

డబుల్ ఇళ్లకు నీటి కటకట

● సరిపోని జలమండలి నీళ్లు ● నాలుగు బ్లాక్‌లకు ఒకే బోర్

ఖైరతాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్, ఇందిరానగర్‌లోని డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు తీవ్రమైన నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. జలమండలి సిబ్బంది అవసరం మేరకు నీరు వదలడం లేదు. ఇక్కడ 210 ఫ్లాట్లు ఉన్నాయి. తాగేందుకు మినరల్ వాటర్‌ను కొనుక్కుంటున్నారు. కొనుగోలు చేయలేని వారు బోరు నీటిపై ఆధారపడుతున్నారు. రెడ్‌హిల్స్ డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో ప్రెషర్‌తో నీరు రావడం లేదు. నీటి కొరత విషయం అధికారులకు తెలిసినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 210 ఫ్లాట్లకు సరిపడా నీరు కావాలంటే రోజూ పూర్తి ప్రెషర్‌తో నాలుగు గంటల పాటు వదలాలి. నెల రోజులుగా లో ప్రెషర్‌తో నీరు వస్తుండడంతో సరిపోవడం లేదని, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. గతంలో తెల్లవారుజామున నీరు వదిలేవారు. ప్రస్తుతం ఉదయం 10 గంటలకు వదులుతున్నారు. అందరికీ నీరందేటప్పటికి మధ్యాహ్నం దాటుతోంది. రోజూ ఉదయమే కూలి పనులు, ఉద్యోగాలకు వెళ్లే వారు నీరు పట్టుకోలేకపోతున్నారు.



ఖైరతాబాద్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

బోరు వేయించేదెన్నడు?

నాలుగు బ్లాకుల్లో నిర్మించిన 210 ఫ్లాట్లకు ఒకే ఒక్క బోరు వేశారు. అది ఏ మాత్రం సరిపోవడం లేదు. నీరు సక్రమంగా రాకపోవడంతో రోజూ బోరుపైనే ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల పాత బోరు మోటార్ చెడిపోవడంతో కమిటీ వారు కొత్త బోరు మోటార్‌ను ఏర్పాటు చేసినా దానిపై భారం ఎక్కువ కావడంతో ఎప్పుడు చెడిపోతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు బోర్లను ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన ఆదేశాల మేరకు ఒక చోట ప్రయత్నం చేయగా బోరు పడలేదు. నీరు ఎక్కడుందో నిపుణులతో పరీక్షించి అక్కడ పవర్ బోర్లు వేస్తామని అధికారులు తెలిపినా ఇప్పటివరకు అలాంటి ప్రయత్నం చేయలేదు. కనీసం ఒక్క బోరైనా వేయిస్తే నీటి కోసం ఇబ్బందులు కొంతమేర తగ్గుతాయి. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి.

బాసరలో గోదావరికి నిత్యహారతి

పంజాగుట్ట, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): కాశీ పుణ్యక్షేత్రంలో నిరంతరాయంగా జరుగుతున్న గంగా హారతి మాదిరిగా గోదావరి పరివాహక ప్రాంతంలో వెలసిన బాసర పుణ్యక్షేత్రంలో నిత్య గంగా (గోదావరి) హారతి కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నట్లు నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ వేద భారతీ పీఠం పండితుడు, అధ్యాపకుడు గురుచరణ్ తెలిపారు. వేద విద్యానంద గిరి స్వామి బాసరలో వేద భారతీ పీఠం అభివృద్ధి ట్రస్టును ఏర్పాటుచేసి వేద పాఠశాల, గోశాల, నిత్య గంగా (గోదావరి) హారతి నిర్వహిస్తున్నారని అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వేదాల విశిష్టతను వివరిస్తూ వేద విద్యానంద గిరి స్వామి రచించిన ఇంటింటా వేదం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ లోక కల్యాణం కోసం వేద పీఠాన్ని ప్రారంభించి హైందవ ధర్మ పరిరక్షణకు వేద విద్యానంద గిరి స్వామి ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వేద పాఠశాలలో 80 మంది విద్యార్థులు వేదాలను అభ్యసిస్తున్నారని, ప్రభుత్వం సహాయం చేస్తే మరింత అభివృద్ధి చేసి విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుతామని అన్నారు. సమావేశంలో ట్రస్ట్ వలంటీర్లు మల్లేష్ రెడ్డి, సురేష్, విజయ్ పాల్గొన్నారు.



ఇంటింటా వేదం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వేద పండితుడు గురుచరణ్, తదితరులు

26న ఎమ్మెల్యే వివేకానందకు అవార్డు ప్రదానం

ఎర్రగడ్డ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): క్రీడలను ప్రోత్సహిస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందకు గ్రాండ్ మాస్టర్ మెమోరియల్ సేవ అవార్డును ఈనెల 26న అందజేస్తున్నట్లు స్పాన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ మొహమ్మద్ సలీం జావిద్ తెలిపారు. శనివారం అకాడమీ బృందం ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా మొహమ్మద్ సలీం జావేద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వివేకానంద కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఆరెకరాల స్థలంలో మున్సిపల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించారని, క్రీడా రంగం అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే వివేకానందకు గ్రాండ్ మాస్టర్ చేవు చు సూట్ మెమోరియల్ సేవ అవార్డుతో పాటు గౌరవ బ్లాక్ బెల్ట్‌ను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 26న కొంపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అకాడమీ సభ్యులు కమలాకర్, షేక్ ఇర్ఫాన్, మొహమ్మద్ ఖలీమ్, షేక్ షరీఫ్ ఉన్నారు.



ఎమ్మెల్యే వివేకానందను ఆహ్వానిస్తున్న స్పాన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ మొహమ్మద్ సలీం జావేద్, తదితరులు

చదువు కోసం బెంగళూరుకు వెళ్లి.. డ్రగ్స్ స్మగ్లర్‌గా యువకుడు

● ప్రైవేట్ ట్రావెల్స్ ద్వారా తెలుగు రాష్ట్రాలకు సరఫరా
● నిఘాపెట్టి పట్టుకున్న టీన్యాబ్, మాదాపూర్ పోలీసులు
● స్మగ్లర్ సహా.. నలుగురు వినియోగదారులు అరెస్టు

హైదరాబాద్ సిటీ, జూన్ 22(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులకోసం బెంగళూరుకు వెళ్లిన యువకుడు.. అక్కడ డ్రగ్స్‌కు అలవాటుపడి దానినే వ్యాపారంగా మార్చుకొని రెండు తెలుగు రాష్ట్రాల్లో కస్టమర్స్‌కు సరఫరా చేస్తున్నాడు. డ్రగ్స్ స్మగ్లర్‌ను, మరో నలుగురు వినియోగదారులను తెలంగాణ నార్కోటిక్ బ్యూరో, మాదాపూర్ పోలీసులు సంయుక్తంగా శనివారం పట్టుకున్నారు. వారి నుంచి రూ.1.50 లక్షల విలువైన ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరుకు చెందిన వెంకట సాయిచరణ్ గ్రాడ్యుయేషన్ చదువు కోసం బెంగళూరుకు వెళ్లాడు. అక్కడ స్నేహితులతో కలిసి మాదక ద్రవ్యాలకు అలవాటుపడ్డాడు. చదువు పూర్తయిన తర్వాత తెలుగు రాష్ట్రాల్లో ఉన్న తన స్నేహితుల ద్వారా కొంతమంది డ్రగ్స్ వినియోగదారులను ఏర్పాటు చేసుకున్నాడు. దీంతో నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి, వైజాగ్, హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లోని కస్టమర్స్‌కు ఎండీఎంఏ డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నాడు. బెంగళూరు నుంచి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్లకు పార్శిల్ కవర్లలో ఇచ్చి డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నాడు. ఇటీవల నగరంలో మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్న నార్కోటిక్ బ్యూరో పోలీసులు డ్రగ్స్ స్మగ్లర్స్, వినియోగదారులపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో సాయిచరణ్ సైబరాబాద్ పరిధిలోని మాదాపూర్‌లో కస్టమర్స్‌కు డ్రగ్స్ సప్లై చేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో మాదాపూర్, నార్కోటిక్ బ్యూరో పోలీసులు సంయుక్తంగా దాడిచేసి సాయిచరణ్‌తో పాటు.. నలుగురు వినియోగదారులు మల్లిక్‌లోకేష్, సందీప్‌రెడ్డి, రాహుల్, సుబ్రమణ్యంలను అదుపులోకి తీసుకున్నారు.



విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న పండిట్, పీఈటీలు

పీఈటీలకు పదోన్నతులు కల్పించాలి

ఖైరతాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతుల్లో పండిట్, పీఈటీలకు ఎటువంటి నిబంధనలు లేకుండా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు శనివారం పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయంలో అందజేశారు. అప్‌గ్రేడ్ అయిన పోస్టులన్నింటిని పండిట్, పీఈటీలతో భర్తీ చేయాలని కోరారు. అవసరం లేని రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేయకుండా అందరికీ పదోన్నతులు కల్పించాలని కోరారు.

27 వరకు నులి పురుగుల మాత్రల పంపిణీ

బోరబండ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): అల్బెండజోల్ మాత్ర పిల్లల్లో మలబద్ధకాన్ని పోగొట్టి, పొట్టను శుభ్రం చేస్తుందని బోరబండ సైట్-3 ఆస్పత్రి వైద్యాధికారి మమత తెలిపారు. ఈ నెల 27 వరకు పిల్లలకు నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. .

ఐటీఎఫ్ సెమీస్‌లో సహజ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ 35కే మహిళల టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి యైసహజ సెమీఫైనల్స్‌లో ప్రవేశించింది. శనివారం అమెరికాలోని విచితలో ముగిసిన ఈ టోర్నీ క్వార్టర్స్‌లో సహజ 6-1, 6-1తో పోలెండ్‌కు చెందిన ఒలివియా లిన్సర్‌ను చిత్తుగా ఓడించి, టైటిల్‌కు చేరువైంది. అంతకుముందు జరిగిన ప్రీక్వార్టర్స్‌లో సహజ 6-2, 6-1తో స్థానిక క్రీడాకారిణి ఫ్లోరస్‌పై గెలిచింది.



హెచ్‌సీఏ ఓపెన్ సెలెక్షన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉమెన్స్ లీగ్ కోసం వర్ధమాన మహిళా క్రికెటర్లను ఎంపిక చేసేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఓపెన్ సెలెక్షన్స్ నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం కార్యదర్శి ఆర్.దేవ్‌రాజ్ వెల్లడించారు. ఈనెల 29, 30తేదీల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉప్పల్ స్టేడియంలో సెలెక్షన్స్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల క్రికెటర్లు సోమవారం నుంచి www.hycricket.in వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదుచేసుకోవాలని చెప్పారు. గతంలో బీసీసీఐ టోర్నమెంట్స్, హైదరాబాద్ క్రికెట్ అకాడమీలో శిక్షణ తీసుకున్న వారు, తెలంగాణ పౌరులు కాని వారు ఈ సెలెక్షన్స్‌లో పాల్గొనడానికి అనర్హులు అని దేవ్‌రాజ్ తెలిపారు.

భయపెట్టారు.. రూ.32.68 లక్షలు దోచేశారు

హైదరాబాద్‌సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు.. రూ.32.68 లక్షల చోరీ చేశారు. ఇరాన్‌కు పంపిన పార్శిల్‌పై ఉన్న వివరాలు మనీ లాండరింగ్ కేసుల్లో నమోదై ఉన్నాయని నగరానికి చెందిన మహిళను భయపెట్టి, ఆమె ఖాతా నుంచి రూ.15.76 లక్షలను, గూగుల్ మ్యాప్‌కు రేటింగ్ ఇస్తే డబ్బులు ఇస్తామని నగరవాసిని నమ్మించి, అతని ఖాతా నుంచి రూ.16.68 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన మహిళకు గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ప్రముఖ సంస్థ నుంచి ఫోన్ చేస్తున్నానని చెప్పిన వ్యక్తి 'మీ పేరుతో ఇరాన్‌కు పంపిన కొరియర్ తిరిగి వచ్చింది. నీకు పార్శిల్‌కు ఎలాంటి సంబంధమూ లేదు. ఈ విషయంపై సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలి' సూచించి, మరో వ్యక్తికి కనెక్ట్ చేశాడు. స్కైప్ కాల్ చేసిన నిందితుడు 'మీ ఆధార్‌కు లింక్ అయిన బ్యాంకు ఖాతాల నుంచి విదేశాలకు అక్రమంగా డబ్బు తరలి వెళ్లింది. మీ ఆధార్‌పై ముంబై అంధేరి పోలీస్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి' అని పత్రాలు చూపాడు. ఈ కేసులకు తనకు ఎలాంటి సంబంధమూ లేదని చెప్పగా, ' మీ బ్యాంకు ఖాతాల వివరాలు ఇవ్వాలి' అని సూచించాడు. 'మీ ఖాతాలో డబ్బులు ఆర్‌బీఐ అకౌంట్‌కు బదిలీ చేయాలి. 30 నిమిషాల్లో వెరిఫికేషన్ పూర్తి చేసి, మీ డబ్బు తిరగి మీ ఖాతాలో జమ చేస్తారు' అని చెప్పాడు. ఇలా చేయని పక్షంలో మనీ లాండరింగ్ కేసులో అరెస్ట్ అవుతారని బెదిరించాడు. నమ్మిన మహిళ తన ఖాతాలో ఉన్న రూ.15.76 లక్షలను అతడు సూచించిన ఖాతాకు బదిలీ చేసింది. తర్వాత మోసపోయానని గ్రహించిన మహిళసైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

● గూగుల్ మ్యాప్‌కు రేటింగ్ ఇస్తే డబ్బులు ఇస్తామని నమ్మించిన సైబర్ నేరగాళ్లు నగరవాసి నుంచి రూ.16.68 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన వ్యక్తికి వాట్సప్‌కాల్ చేసిన సైబర్ నేరగాళ్లు గూగుల్ మ్యాప్‌కు రేటింగ్స్ ఇస్తే డబ్బులు ఇస్తామని నమ్మించారు. ముందుగా కొద్ది మొత్తం ఖాతాలో జమ చేశారు. మరింత డబ్బు కావాలంటే కొంత మొత్తం రీఫండబుల్ డిపాజిట్ చేయాలని సూచించారు. వారి మాటలు నమ్మిన వ్యక్తి రూ.16.68 లక్షలు వారు చెప్పిన ఖాతాకు బదిలీ చేశాడు. తర్వాత నుంచి ఫోన్‌లు స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి, సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

జీతాల కోసం కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

ఎర్రగడ్డ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ ఉద్యోగులు శనివారం ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమవారం నాటికి జీతాలు ఇవ్వకుంటే పనులను బహిష్కరించి ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఆల్ సర్వీస్ కాంట్రాక్ట్ యాజమాన్యం కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని.. రెండు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, జీతాలు అడిగితే సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారని కార్మికులు ఆరోపించారు. జీతాలు రాక ఇల్లు గడవడం కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన వారిలో యూనియన్ నాయకులు శ్రీధర్, ఓం ప్రకాష్, జలంధర్, మల్లేష్, అమర్, అమరేందర్, బిక్షపతి ఉన్నారు.



జీతాల కోసం నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

వివాహేతర సంబంధం.. యువకుడి హత్య

చాంద్రాయణగుట్ట, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళతో వివాహేతర సంబంధం యువకుడి హత్యకు దారితీసింది. బాబాకాంట సొహైల్ కాలనీకి చెందిన జాకిర్‌అలీ(29)కి ఐదు సంవత్సరాలుగా అచ్చిరెడ్డినగర్‌కు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఇటీవల ఆ మహిళ తనను మరిచిపోవాలని అనేకసార్లు చెప్పినా జాకిర్‌అలీ వేధించాడు. ఈ విషయం మహిళ తన సోదరుడికి చెప్పింది. అతను కూడా జాకిర్‌అలీని పలుమార్లు హెచ్చరించినా మారలేదు. శుక్రవారం రాత్రి మహిళ ఇంటికి జాకిర్‌అలీ వచ్చాడు. విషయం తెలుసుకుని సోదరుడు కూడా రావడంతో ఇద్దరి మధ్య తీవ్రవాగ్వాదం జరిగింది. ఆగ్రహానికి గురైన ఆమె సోదరుడు జాకిర్‌అలీ తలపై ఐరన్‌రాడ్‌తో కొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఫలక్‌నుమా పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ఖైరతాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఓ వ్యక్తి మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖైరతాబాద్, మారుతీనగర్‌కు చెందిన హరి అరవింద్‌రావు (34) ప్రైవేట్ ఉద్యోగి. ఆరేళ్ల క్రితం ఇతడికి వివాహమైంది. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న హరి మద్యానికి బానిసయ్యాడు. శనివారం సాయంత్రం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. అదే ఇంట్లో పై అంతస్తులో ఉండే సోదరుడు గమనించి కిందికి దించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు తెలిపారు. అన్ని కోణాల్లో విచారిస్తున్నామని ఖైరతాబాద్ ఎస్ఐ శ్రీరాములు తెలిపారు.

యువతితో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్టు

బంజారాహిల్స్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు మీద నడుచుకుంటూ వెళుతున్న యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్‌కు చెందిన ఓ యువతి (23) నిత్యం వాకింగ్ వెళుతుంటుంది. మాదాపూర్‌లో సెకండ్ హ్యాండ్ కార్లు అమ్మకాలు చేసే సంస్థలో ఉద్యోగం చేస్తున్న గౌతం ఆమెను వెంబడించసాగాడు. ఈ నెల 20న యువతి జర్నలిస్టు కాలనీలో నడుచుకుంటూ వెళుతుండగా ఆమెను తాకి అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మైనర్‌పై యువకుడి లైంగికదాడి

నిందితుడి అరెస్ట్, రిమాండ్

హిమాయత్‌నగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఓ మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని నారాయణగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం నారాయణగూడ పీఎస్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్, ఎస్సై షఫీతో కలిసి సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఫైఫాబాద్‌కు చెందిన మైనర్(16) నారాయణగూడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన సయ్యద్ ఖలీల్(22) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గత రెండేళ్లుగా ప్రేమికుడిగా నటిస్తూ బాలికను వేధిస్తున్నాడు. ఇటీవల బాలిక కళాశాలకు సరిగా రాకపోతుండడంతో యాజమాన్యం ఆమె తండ్రికి ఫోన్‌చేసి సమాచారం ఇచ్చింది. దీంతో బాలిక ఆచూకీ ఎంతకీ తెలియక పోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నాంపల్లి రైల్వేస్టేషన్‌లో బాలికను గుర్తించిన పోలీసులు అక్కడికి వెళ్లారు. పోలీసులను చూసిన సయ్యద్‌ఖలీల్ పారిపోయాడు. బాలికను భరోసాసెంటర్‌కు తరలించి వాంగ్మూలం నమోదు చేశారు. ఆమెను ఓయోకు తీసుకెళ్లిన సయ్యద్‌ఖలీల్ తనపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలు తెలిపింది. అనంతరం నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతడి నుంచి యాక్టివా వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఎఫ్ఏసీపై వసూళ్ల ఆరోపణలు

బోరబండ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు వసూలు చేశాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న జీహెచ్ఎంసీ ఎఫ్ఏసీపై చర్య తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. సదరు ఉద్యోగిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు తెలిసింది.

అంబేడ్కర్ వర్సిటీలో యోగా దినోత్సవం

హైదరాబాద్ సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి) : డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, అరుణయోగ యోగా శిక్షణ పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ వర్సిటీలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా మాత అరుణాదేవి విశ్వవిద్యాలయ ఉద్యోగులకు చిత్కళా ధ్యానంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డా.అనుసూయ, డా.సింధూజ, ఎన్.రవీందర్, డా.అనిల్ నందూరి, అంతర్జాతీయ యోగా ఛాంపియన్ జానకి, కృష్ణా విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి ప్రొ.వి.వెంకయ్య, విశ్వవిద్యాలయ పలు విభాగాల డైరెక్టర్లు, డీన్స్, అధిపతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరుణాదేవి

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

యూసఫ్‌గూడ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఓ యువతితో కొన్నేళ్ల సన్నిహితంగా ఉండి ఆ తరువాత వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. యూసఫ్‌గూడకు చెందిన ఓ యువతి అదే ప్రాంతానికి చెందిన అర్బజ్‌ఖాన్‌తో 2017 నుంచి సన్నిహితంగా ఉండేది. ఆ సమయంలో అర్బజ్‌ఖాన్ యువతి ఫొటోలు వీడియోలు తీశాడు. 2022లో యువతితో విడిపోయిన అర్బజ్‌ఖాన్ మరో మహిళను వివాహం చేసుకున్నాడు. అయినా యువతికి ఫోన్ చేసి వేధిస్తున్నాడు. తనతో గడిపేందుకు గదికి రావాలని, లేకుంటే నగ్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని బెదిరిస్తున్నాడు. వేధింపులు భరించలేక ఆ యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని యువకుడికి గాయాలు

యూసఫ్‌గూడ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ మసీదు గల్లీలో శుక్రవారం రాత్రి ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ద్విచక్రవాహనంపై కూర్చుని ఉన్న సుభాన్ అనే యువకుడికి ఢీకొంది. అనంతరం పార్కు చేసి ఉన్న మూడు ద్విచక్రవాహనాలు, ఓ కారును ఢీకొంది. గాయపడ్డ సుభాన్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కారు నడిపిన వ్యక్తి పారిపోయాడు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సీతాఫల్‌మండి రోడ్డులో బుల్లెట్‌పై వస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బుల్లెట్‌పై ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): మాస్ లీడర్‌గా పేరున్న సికింద్రాబాద్ శాసనసభ్యుడు టి.పద్మారావు శనివారం వారాసిగూడలో పాల్గొనే కార్యక్రమానికి సీతాఫల్ మండి ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వారాసిగూడ చౌరస్తా వరకు స్వయానా బుల్లెట్ నడిపి అందరినీ ఆశ్చర్యపర్చారు. కాన్వాయ్, గన్‌మెన్‌లు హడావిడి లేకుండా పక్కనే ఓ కార్యకర్త వెంటరాగా బైక్‌మీద వెళ్లారు.

ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌లను పరిశీలించిన కార్పొరేటర్

రెజిమెంటల్‌బజార్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్ కుమ్మరిగూడలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌లను కార్పొరేటర్ కొంతం దీపిక సందర్శించారు. బుక్స్, యూనిఫార్మ్స్ గూర్చి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య పెంచడానికి శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడి పిల్లలకు ఆటబొమ్మలు బహుకరించారు.

సైబర్ నేరగాళ్లు.. రూ.32.68 లక్షల చోరీ

● మనీలాండరింగ్ కేసంటూ.. మహిళను భయపెట్టి, ఖాతా నుంచి రూ.15.76 లక్షలు

హైదరాబాద్‌సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు.. రూ.32.68 లక్షల చోరీ చేశారు. ఇరాన్‌కు పంపిన పార్సిల్‌పై ఉన్న వివరాలు మనీ లాండరింగ్ కేసుల్లో నమోదై ఉన్నాయని నగరానికి చెందిన మహిళను భయపెట్టి, ఆమె ఖాతా నుంచి రూ.15.76 లక్షలను, గూగుల్ మ్యాప్‌కు రేటింగ్ ఇస్తే డబ్బులు ఇస్తామని నగరవాసిని నమ్మించి, అతని ఖాతా నుంచి రూ.16.68 లక్షలు కాజేశారు.

నగరానికి చెందిన మహిళకు గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ప్రముఖ సంస్థ నుంచి ఫోన్ చేస్తున్నానని చెప్పిన వ్యక్తి 'మీ పేరుతో ఇరాన్‌కు పంపిన కొరియర్ తిరిగి వచ్చింది. నీకు పార్సిల్‌కు ఎలాంటి సంబంధమూ లేదు. ఈ విషయంపై సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలి' సూచించి, మరో వ్యక్తికి కనెక్ట్ చేశాడు. స్కైప్ కాల్ చేసిన నిందితుడు 'మీ ఆధార్‌కు లింక్ అయిన బ్యాంకు ఖాతాల నుంచి విదేశాలకు అక్రమంగా డబ్బు తరలి వెళ్లింది. మీ ఆధార్‌పై ముంబై అంధేరి పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి' అని పత్రాలు చూపాడు. ఈ కేసులకు తనకు ఎలాంటి సంబంధమూ లేదని చెప్పగా, 'మీ బ్యాంకు ఖాతాల వివరాలు ఇవ్వాలి' అని సూచించాడు. 'మీ ఖాతాలో డబ్బులు ఆర్‌బీఐ అకౌంట్‌కు బదిలీ చేయాలి. 30 నిమిషాల్లో వెరిఫికేషన్ పూర్తి చేసి, మీ డబ్బు తిరగి మీ ఖాతాలో జమ చేస్తారు' అని చెప్పాడు. ఇలా చేయని పక్షంలో మనీ లాండరింగ్ కేసులో అరెస్ట్ అవుతారని బెదిరించాడు. నమ్మిన మహిళ తన ఖాతాలో ఉన్న రూ.15.76 లక్షలను అతడు సూచించిన ఖాతాకు బదిలీ చేసింది. తర్వాత మోసపోయానని గ్రహించిన మహిళ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

భూలక్ష్మమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

తిరుమలగిరి, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్‌లోని భూలక్ష్మమ్మ దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బోయిన్‌పల్లి మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్ రెడ్డి హాజరై అమ్మవారికి మొక్కులు చల్లించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పూర్ణచందర్, జీవి బాల్‌రాజ్, రవీందర్ రెడ్డి దత్తు, నిఖిల్, నాగరాజ్, తరుణ్, సతీష్, విజయలక్ష్మి, జయంతి, పద్మ, ఉదయిని, ప్రమీల పాల్గొన్నారు.

ఉద్యాన పాలిటెక్నిక్‌లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజేంద్రనగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో రెండు సంవత్సరాల ఉద్యాన డిప్లొమా కోసం నోటిఫికేషన్ జారీచేసింది. ఉద్యాన పాలిటెక్నికల్‌లో 200 సీట్లు ఉండగా, ఆదిలాబాద్, రమగిరికిల్లా, కొల్లాపూర్ పాలిటెక్నిక్ ఉద్యాన కళాశాలలలో 40 చొప్పున ఇన్‌టెక్ కెపాసిటీ ఉందని వర్సిటీ అధికార వర్గాలు తెలిపాయి. మరో రెండు అఫిలేటెడ్ పాలిటెక్నిక్‌లు గడ్డిపల్లిలో గల గంటా గోపాల్‌రెడ్డి ఉద్యాన పాలిటెక్నిక్, మహబూబాబాద్‌లోని తొర్రూర్‌లో గల విశ్వధార హార్టికల్చర్ పాలిటెక్నిక్‌లో కూడా 40 చొప్పున సీట్లు ఉన్నాయన్నారు. ఈనెల 15 నుంచి దరఖాస్తులను తీసుకుంటున్నారని, జూలై 15వ తేదీ వరకు అందజేయవచ్చన్నారు. పాలిసెట్ 2024 లేదా 10వ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత, ఇంటర్ ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. 2024 డిసెంబర్ 31 నాటికి కనీసం 15 సంవత్సరాలు, గరిష్టంగా 22 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. 60శాతం సీట్లు గ్రామీణ ప్రాంతాల్లో కనీసం నాలుగు సంవత్సరాలు చదివిన విద్యార్థులకు కేటాయిస్తారని తెలిపారు.

మోజర్ల ఉద్యాన కళాశాలలో డిప్లొమా

వనపర్తి జిల్లా మోజర్లలోని ఉద్యాన కళాశాలలో, కొల్లాపూర్ ఉద్యాన పాలిటెక్నిక్‌లో ఉద్యాన డిప్లొమా చేయొచ్చని అధికారులు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట్ జిల్లాల విద్యార్థులకు ఇక్కడి ప్రాంగణం దగ్గరగా ఉంటుందని పాలిటెక్నిక్ వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పిడిగెం సైదయ్య తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేరుగా బీఎస్సీ హార్టికల్చర్ డిగ్రీలో హార్టీ సెట్ ద్వారా సీటు సంపాదించవచ్చు. ఇతర వివరాల కోసం హెల్ప్ డెస్క్ నెంబర్ 9652456779లో సంప్రదించాలని లేదా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని రిజిష్ట్రార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

హెచ్‌సీఏ ఓపెన్ సెలెక్షన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉమెన్స్ లీగ్ కోసం వర్ధమాన మహిళా క్రికెటర్లను ఎంపిక చేసేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఓపెన్ సెలెక్షన్స్ నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం కార్యదర్శి ఆర్.దేవ్‌రాజ్ వెల్లడించారు. ఈనెల 29, 30 తేదీల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉప్పల్ స్టేడియంలో సెలెక్షన్స్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల క్రికెటర్లు సోమవారం నుంచి www.hycricket.in వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదుచేసుకోవాలని చెప్పారు. గతంలో బీసీసీఐ టోర్నమెంట్స్, హైదరాబాద్ క్రికెట్ అకాడమీలో శిక్షణ తీసుకున్న వారు, తెలంగాణ పౌరులు కాని వారు ఈ సెలెక్షన్స్‌లో పాల్గొనడానికి అనర్హులు అని దేవ్‌రాజ్ తెలిపారు.

ఆషాడ బోనం సమీక్షకు దూరం

● నిధుల ఏర్పాట్లపై సందిగ్ధంలో మహాకాళి ఆలయ ప్రతినిధులు


ఉజ్జయినీ మహాకాళి, మాణిభ్యాల అమ్మవార్లు


ఉజ్జయినీ మహాకాళి దేవస్థానం

రాంగోపాల్‌పేట్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి పొందిన బోనాల పండుగ అంటే ముందుగా గుర్తుకు వచ్చేది లష్కర్ బోనాలు. ఆషాడ బోనాల పండుగకు రాష్ట్రం నుంచే కాక, పొరుగు రాష్ట్రల నుంచి కూడా లక్షలాదిగా భక్తులు వచ్చి ఉత్సవాలలో పాల్గొని ఉజ్జయినీ మహాకాళి అమ్మవారిని దర్శించుకుంటారు. అలాంటి అమ్మవారి ఆషాడ బోనాల జాతరకు రెండు నెలల ముందు నుంచే ఏర్పాట్లు చేస్తే కానీ అవి పూర్తికావు.

తలో పార్టీ

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి దేవస్థానం ఈ ఏడు వినూత్నమైన స్థితిలో ఉంది. అందుకు కారణం ఆలయం వద్ద ఉండే డివిజన్ కార్పొరేటర్ బీజేపీ వ్యక్తి, శాసన సభ్యులు బీఆర్ఎస్‌కు చెందిన వ్యక్తి. ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీది. బోనాల పండుగ సందర్భంగా ఆయా పార్టీలు తమ పట్టును నిరూపించుకోవాలని, తమ సత్తాను ప్రదర్శించాలని చూస్తున్నాయి. మూడు ముక్కలాట లాగా.... ట్రయాంగిల్ సిరీస్‌లాగా ఉన్న ఇలాంటి స్థితిలో ఉత్సవాలను వైభవంగా ఎలా నిర్వహిస్తారో అని అన్నివర్గాల ప్రజలు ఆతృతగా చూస్తున్నారు.

రాష్ట్ర పండుగగా...

గత సంవత్సరం జరిగిన బోనాల పండుగకు సంబంధించి ఇప్పటికీ కొన్ని దేవాలయాలకు నిధులు అందలేదు. ఈ సంవత్సరం కూడా ప్రభుత్వం నిధులు ఎంత కేటాయిస్తుందో, అందులో బకాయిలు ఉంటాయో లేదో అని దేవాలయ కమిటీల ప్రతినిధులు సందిగ్ధావస్థలో ఉన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న ఉత్తర మండల డీసీపీ

సాధారణ స్థితిలో కష్టపడితే అసాధారణ స్థితిలో కష్టపడే అవసరం ఉండదు

● డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

ప్రతిష్టాత్మకమైన ఉత్సవాలలో అన్ని శాఖలవారు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ఉత్సవాలను విజయవంతం చేయవచ్చని ఉత్తర మండల డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు. శనివారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి దేవస్థాన సమావేశ మందిరంలో ఆమె వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారుల నుంచి బోనాల ఉత్సవాల సందర్భంగా వారు నిర్వహించే విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ గుత్తా మనోహర్ రెడ్డి, అదనపు డీసీపీ పగడాల అశోక్, గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, ఈఈ సుదర్శన్, డీఎంహెచ్ఓ వెంకటి, మహంకాళి పోలీస్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్‌లతో పాటు ఫైర్, విద్యుత్, బారికేడ్, ట్రాఫిక్, వాటర్ వర్క్స్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తలసాని మార్క్ లేనట్టేనా?

ఇటీవల శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ మృతి చెందడంతో శ్రీనివాస్ యాదవ్ స్తబ్దుగా ఉన్నారు. ఆయన యాక్టివ్ అయితే ఈపాటికి కనీసం రెండు సమీక్షా సమావేశాలు అయినా జరిగేవని స్థానికుల అభిప్రాయం. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అయినా ఇప్పటి వరకు ఈ అంశంపై దృష్టిపెట్టకపోవడం శోచనీయం. రెండు వందల ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన ఉజ్జయినీ మహాకాళి దేవస్థానంలో జూలై 7వ తేదీన ఎదుర్కోళ్ల (ఘటోత్సవం) కార్యక్రమంలో ప్రారంభమయి 21న బోనాల ఉత్సవాలు, 22న రంగం కార్యక్రమం ఉంటుంది. ఆ మరుసటి వారం 28వ తేదీన ఉమ్మడి దేవాలయాలలో ఉత్సవాలు ఉంటాయి.

మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మోక్షం

● సంతోషం వ్యక్తం చేస్తున్న పేదవర్గాలు

తిరుమలగిరి, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు తిరుమలగిరి లాల్‌బజార్‌లోని మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. పేదవర్గాలు శుభకార్యాలు చేసుకునే మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్‌ను సుమారు 8యేళ్ల క్రితం డంపింగ్ యార్డ్‌గా మార్చారు. కొన్ని సంవత్సరాలుగా ఆ పరిసర ప్రాంతాల్లోని పేద వర్గాలు పెళ్లిళ్లు, శుభకార్యాలు అతి తక్కువ ఖర్చుతో జరుపుకునేవారు. అయితే కంటోన్మెంట్ ప్రాంతంలోని చెత్తను మొత్తం తీసుకొచ్చి ఇక్కడ చెత్త వేసి డంపింగ్ యార్డ్‌గా మార్చారు. అధికారులు ఈ కమ్యూనిటీ హాల్ ప్రాంతాన్ని వేస్ట్ మానేజ్‌మెంట్ ఏర్పాటు చేద్దామని రంగం సిద్ధం చేసుకున్నారు. స్థానికులు, ప్రజాప్రతినిధి అడ్డుకోవడంతో వేస్ట్ మానేజ్‌మెంట్ ఏర్పాటును కంటోన్మెంట్ అధికారులు ఉపసంహరించుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా డంపింగ్ యార్డును తొలగించాలని కోరుతూ స్థానికులు ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. రక్షణ శాఖ అధికారులు ఒప్పుకోకపోవడంతో సమస్య మళ్లీ తిరిగి వెనక్కి వచ్చింది.


డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

ఏసీ కన్వెన్షన్ హాల్‌ను నిర్మిస్తా

● ఎమ్మెల్యే శ్రీగణేష్

మహాత్మా గాంధీ కమ్యూనిటీ హాలు స్థానిక ప్రజలు శుభకార్యాలు చేసుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉండేది. గత పాలకమండలి కంటోన్మెంట్ అధికారుల నిర్ణయాలతో డంపింగ్ యార్డ్‌గా మారింది. త్వరలోనే డంపింగ్ యార్డును తొలగించి అధునాతన హంగులతో నగరంలోనే నంబర్ 1గా తీర్చిదిద్దడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని ఎమ్మెల్యే శ్రీగణేష్ చెప్పారు. శనివారం డంపింగ్ యార్డ్‌ను ఆయన పరిశీలించారు. కమ్యూనిటీ హాల్‌ను 3 అంతస్తులతో నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో రేమండ్, సాంసన్, మురళీ, రాకేష్, అమిత్, మైఖెల్ అబ్రహం, డెంజిల్, పోల రమేష్ మహిళా నాయకురాలు భవాని, సరిత, దివ్య, జెన్నీఫర్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను పెంచుదాం

● ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని, మొక్కల పెంపకానికి తమవంతు ప్రోత్సాహం అందిస్తామని మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. శనివారం వారాసిగూడ చౌరస్తాలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గరికపోగుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్పొరేటర్లు సామల హేమ (సీతాఫల్‌మండి), కంది శైలజ (బౌద్ధనగర్)తో కలిసి ఆయన మొక్కలను నాటి నీళ్లను పోశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య నివారణకు మొక్కలు పెంపకమే శరణ్యమన్నారు. ఇళ్ల పరిసరాల్లో, క్రీడామైదానాల్లో, స్కూళ్లలో మొక్కలను పెంచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకుడు మహమ్మద్ ఇషాఖ్, మాజీ కార్పొరేటర్ కందినారాయణ, నాయకులు పి.సంజీవ్‌ముదిరాజ్, సుంకు రామచందర్, బెజ్జంకి రాజేష్, సుందర్, నవీన్, పాకసాయి, శైలేందర్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం...

సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తెలిపారు. సీతాఫల్‌మండి ఎమ్మెల్యే కార్యాలయంలో ఇటీవల మృతి చెందిన పార్టీ సీనియర్ నేత అంజయ్య కుటుంబసభ్యులకు రెండు లక్షల రూపాయల బీమా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

హమాలీ బస్తీలో లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు

హమాలీ బస్తీలో లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు ప్రక్రియను త్వరగా పూర్తిచేసేలా ప్రభుత్వంపై వత్తిడి తీసుకువస్తామని ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ తెలిపారు. సీతాఫల్‌మండి కార్యాలయంలో హమాలీ బస్తీవాసులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు.

సికింద్రాబాద్ నుంచి బయలుదేరిన జ్యోతిర్లింగ దక్షిణ యాత్ర రైలు

హైదరాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర భారత్ గౌరవ్ టూరిస్ట్ సర్క్యూట్ రైలు శనివారం 592మంది ప్రయాణికులతో సికింద్రాబాద్ స్టేషన్ నుంచి బయలుదేరింది. తొమ్మిదిరోజుల్లో తిరువణ్ణామలై (అరుణాచలం) రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు పుణ్య క్షేత్రాలను దర్శించేందుకు అనువుగా జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర భారత్ గౌరవ్‌ను ఏర్పాటుచేశారు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరిన రైలు కాజీపేట, వరంగల్, ఖమ్మం స్టేషన్లతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ప్రయాణికులు ఎక్కి దిగడానికి ఏర్పాట్లు చేశారు. సీనియర్ ప్రయాణికులు శ్రీమతి, రవీంద్రనాథ్ రైలును లాంఛనంగా ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భారత్ గౌరవ్ టూరిస్టు రైలుకు ఆదరణ లభిస్తుందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తెలిపారు.

దటీజ్... కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): గల్లీ నుంచి ఢిల్లీకి ఎదిగిన తన రాజకీయ గురువు బండారు దత్తాత్రేయ అడుగుజాడల్లో నడిచి, గురువుకు తగ్గ శిష్యునిగా, కేంద్ర స్థాయికి చేరుకుని మోదీ సర్కారులో కీలక భూమిక పోషిస్తున్న జి.కిషన్‌రెడ్డి... పార్టీ శ్రేణులతో మమేకం కావడంలో ఏమాత్రం తగ్గడంలేదు. దత్తన్న మాదిరిగానే ప్రతి ఒక్కరినీ పేరు పెట్టి పలకరించే గుణం కలిగి ఉన్న కిషన్‌రెడ్డి కమలం పార్టీ నాయకుల పట్ల కనబరచే అభిమానానికి ఇదో తార్కాణం. కేంద్ర మంత్రివర్గంలో వరుసగా రెండోసారి చోటు దక్కించుకున్న కిషన్‌రెడ్డి నగరానికి విచ్చేసిన సందర్భంగా ఆయనను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అలేఖ్య ప్రతాప్ శనివారం కిషన్‌రెడ్డి నివాసంలో కలిశారు. కిషన్‌రెడ్డికి అభినందనలు తెలుపుతూ... తాను తీసుకువచ్చిన దుశ్శాలువ బయటకు తీశారు. కిషన్‌రెడ్డికి శాలువా కప్పేందుకు రెడీ అవుతున్నారు. ఇంతలో కిషన్‌రెడ్డి ఆమె చేతుల్లోని శాలువాను తీసుకున్నారు. శాలువాను తానే ఓపెన్ చేసి, అలేఖ్యకు కప్పారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేస్తేనే తనలాంటి వారికి పదవులు దక్కి, ప్రజాసేవ, దేశ సేవ చేసే అవకాశం, అదృష్టం కలుగుతున్నాయని, అందుకే పార్టీ కేడర్‌ను, నాయకులను గౌరవించడం తమ విధిగా పేర్కొని, అందరి అభినందనలు అందుకున్నారు.


కిషన్‌రెడ్డితో అలేఖ్య తదితరులు

బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

తార్నాక, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం తార్నాకలోని మర్రి క్రిష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో సికింద్రాబాద్ నియోజకవర్గ బూత్ అధ్యక్షులు, కో-ఆర్డినేటర్ల సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కేంద్ర మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా వచ్చిన కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు శాలువాలతో, పుష్ప గుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు తనపై నమ్మకంతో ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించారని, అంకిత భావంతో పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, మహంకాళీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీకారెడ్డి, శ్యాంసుందర్ గౌడ్, శారద మల్లేష్, కనకట్ల హరి, రవిప్రసాద్ గౌడ్, వెంకటేశ్ గౌడ్, వీరన్న, రాము వర్మ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపికలు

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని క్రీడాపాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి నాలుగో తరగతిలో ప్రవేశానికి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం తెలిపారు. సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో ఈనెల 27 నుంచి 30 వరకు ఉదయం 8 గంటల నుంచి ఎంపిక పోటీలుంటాయని చెప్పారు. 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, 6-10 మీటర్ల షటిల్ రన్, స్టాండింగ్స్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ, కిలో మెడిసిన్ బాల్‌త్రో, 800 మీటర్ల పరుగు, బరువు, ఎత్తు, మెడికల్ టెస్టులుంటాయన్నారు. హైదరాబాద్ జిల్లాలో మండల స్థాయి ఎంపికలు ఈనెల 24, 25 తేదీల్లో జరుగుతాయని, జిల్లా స్థాయి ఎంపికలు 27 నుంచి 30 వరకు నిర్వహిస్తామన్నారు. అలాగే రాష్ట్రస్థాయి ఎంపికలు జులై 8 నుంచి 12 వరకు హకీంపేటలో ఉంటాయని చెప్పారు. ప్రవేశ పోటీలకు హాజరయ్యే బాలబాలికలు 1.9.2015 నుంచి 31.08.2016 మధ్య పుట్టిన వారై ఉండాలని, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలని వివరించారు. మరిన్ని వివరాలకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీకి చెందిన 040-27900649 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఒలింపిక్స్‌లో పతకం సాధిస్తా

● స్టార్ షూటర్ ఇషాసింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): పారిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించడానికి వంద శాతం ప్రయత్నిస్తానని హైదరాబాద్ యువ షూటర్ ఇషా సింగ్ ఆత్మవిశ్వాసంతో చెప్పింది. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇషా సింగ్ మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించాలనే లక్ష్యాన్ని చేరుకున్నానని, ఇక మిగిలింది పతకాన్ని ముద్దాడడమేనని తెలిపింది. ఏడేళ్లగా పడుతున్న కష్టానికి ప్రతిఫలంగా పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం దక్కిందని, ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని చెప్పింది. ఒలింపిక్స్ ట్రయల్స్‌లో విజయం సాధించడానికి పడిన కష్టం ఇప్పటివరకు ఏ టోర్నీలోనూ పడలేదని, విశ్వక్రీడల్లో రాణించి, మువ్వన్నెల జెండాను రెపరెపలాడిస్తానని ధీమా వ్యక్తం చేసింది.


మాట్లాడుతున్న ఇషాసింగ్

రైల్వే స్టేషన్‌లో సెల్‌ఫోన్ దొంగ పట్టివేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో వెయింటింగ్‌హాలు వద్ద సెల్‌ఫోన్ దొంగను సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ నాగమ్మశక్తి టీం మహిళా కానిస్టేబుళ్లు పట్టుకున్నారు. ఆర్పీఎఫ్ ఎస్ఐ నసీమా తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో శనివారం సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఎస్ఐ సుబ్బారావుతోపాటు ఖాజీపేట్ ఆర్పీఎఫ్ నాగమ్మశక్తి టీం మహిళా కానిస్టేబుళ్లు శ్రీలేఖ, రాధ, జ్యోతిలతోపాటు సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. వెయింటింగ్ హాలు వద్ద ఓ వ్యక్తి అనుమానాదస్పదంగా తిరుగుతుండగా అతనిని పట్టుకొని విచారించగా తాను గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు వద్ద ప్రయాణికుడి నుంచి సెల్‌ఫోన్ దొంతనం చేశానని నేరం ఒప్పుకున్నాడు. రూ.8వేలు విలువ చేసే నోట్ ప్రో సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని నిందితుడిని సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు అప్పగించారు.


సెలఫోన్ దొంగను పట్టుకున్న ఖాజీపేట్ ఆర్పీఎఫ్ నాగమ్మశక్తి టీం కానిస్టేబుళ్లు

చదువంటే ఇష్టం లేదట!

● రైల్వే స్టేషన్‌లో తిరుగుతున్న ఇద్దరు బాలలు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): చదువంటే ఇష్టం లేక ఓ ఇద్దరు బాలలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సంచిస్తుండగా ఆర్పీఎఫ్ శక్తి టీం పట్టుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన 11 ఏళ్లలోపు ఉన్న ఇద్దరు బాలలు చదువంటే ఇష్టం లేకపోవడంతో శనివారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్‌లో ఇదరూ తిరుగతుండగా ఆ సమయంలో సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ శక్తి టీం మహిళా కానిస్టేబుళ్లు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించారు. తమకు చదువంటే ఇష్టం లేదని, అందుకే రైల్వేస్టేషన్‌కు వచ్చామన్నారు. ఇద్దరినీ ప్రభుత్వ చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. ఆ తరువాత తల్లిదండ్రులను పిలిపించి, ఐడీ కార్డులను పరిశీలించి తల్లిదండ్రులకు అప్పగిస్తామని ఆర్పీఎఫ్, చైల్డ్‌లైన్ ప్రతినిధి తెలిపారు.

సికింద్రాబాద్‌లో వ్యక్తి అదృశ్యం


వెంకట సాయి కుమార్

అడ్డగుట్ట, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): లాడ్జి నుంచి ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం... మల్కాజిగిరి గౌతమి స్కూలు సమీప ప్రాంతానికి చెందిన వెంకటసాయి (59) జలమండలి కార్యాలయంలో ఉద్యోగి. కుటుంబ గొడవల కారణంగా గత ఆరు నెలలు నుంచి వెంకటసాయి బయటే ఉంటున్నారు. ఈ క్రమంలో గత 15 రోజుల నుంచి సికింద్రాబాద్‌లోని పద్మజ లాడ్జిలో రూం నెంబరు 15లో అద్దెకు తీసుకుని ఉంటున్నాడని తెలుసుకుని లాడ్జిలో వాకబు చేశారు. ఇక్కడ కూడా లాడ్జి నుంచి బయటికి వెళ్లి వారం రోజులు అవుతున్నా ఇతని జాడ లభించలేదు. ఇతని భార్య పద్మాంజలి బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో శనివారం గోపాలపురం పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే 8712660247 నెంబరుకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు కేసు దర్యాప్తులో ఉంది.

రైల్వేస్టేషన్‌లో జేబు దొంగ పట్టివేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల జేబులు కత్తిరిస్తున్న దొంగను సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ శక్తి టీం పట్టుకుంది. వివరాల ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ శక్తి టీం మహిళా కానిస్టేబుళ్లు మాధురి, విజయ, సుధ, వందన, లావణ్యల బృందంతోపాటు సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. దొంగ జేబులో కొంత నగదు దొరడంతో ప్రయాణికుల జేబులను కత్తిరిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


వీర నాగులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన బొల్లారం బజారు ఏరియాలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లా మంత్రాలయం, కల్లందేవకుంట గ్రామానికి చెందిన కే.వీరనాగులు(46) కూలీ పనిచేసుకుంటూ బొల్లారంలో ఉంటున్నాడు. తాగుడికి బానిసై చేసిన అప్పులు తీర్చలేక శనివారం అల్వాల్ - బొల్లారం బజారు రైల్వేస్టేషన్ సమీపంలో ఎంఎంటీఎస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

చాంద్రాయణగుట్ట, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళతో వివాహేతర సంబంధం యువకుడి హత్యకు దారితీసింది. బాబాకాంట సొహైబ్ కాలనీకి చెందిన జాకిర్‌అలీ(29)కి ఐదు సంవత్సరాలుగా అచ్చిరెడ్డినగర్‌కు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఇటీవల ఆ మహిళ తనను మరిచిపోవాలని అనేకసార్లు చెప్పినా జాకిర్‌అలీ వేధించాడు. ఈ విషయం మహిళ తన సోదరుడికి చెప్పింది. అతను కూడా జాకీర్‌అలీని పలుమార్లు హెచ్చరించినా మారలేదు. శుక్రవారం రాత్రి మహిళ ఇంటికి జాకిర్‌అలీ వచ్చాడు. విషయం తెలుసుకుని సోదరుడు కూడా రావడంతో ఇద్దరి మధ్య తీవ్రవాగ్వాదం జరిగింది. ఆగ్రహానికి గురైన ఆమె సోదరుడు జాకిర్‌అలీ తలపై ఐరన్‌రాడ్‌తో కొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఫలక్‌నుమా పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.